
క్లుప్తంగా

నాగదేవతలకు ప్రత్యేక పూజలు



నాగదేవతలకు పూజలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్ తదితరులు నాగులకట్ట వద్ద నాగదేవతలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పంచలింగ సహిత నాగదేవత విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించారు. భక్తులు భక్తిప్రపత్తులతో నాగదేవతలను పూజించారు. సుబ్రహ్మణ్యం స్వామికి అర్చన, నివేదన గావించారు. మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి



పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్: జ్యేష్ఠమాస శివరాత్రి వేడుకలు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మహాశివుడు ప్రత్యేక పూజలందుకున్నాడు. ఏకవార రుద్రాభిషేకం, భస్మార్చన, రుద్రం, చమకం పఠనం శాస్త్రోక్తంగా సాగాయి. విశేష పూజలనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, శయనోత్సవ వేడుకలను అర్చకులు సంప్రదాయరీతిలో జరిపించారు. మాసశివరాత్రి రోజు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

రోడ్లన్నీ నిర్మానుష్యం



గుత్తిలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రోడ్డు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో మంగళవారం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయియి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లపై జనాలు కాని, వాహనాలు కాని తిరగలేదు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు దుకాణాలు, హోటళ్లు మూయించారు. దీంతో జనాలు బయటకు రాకపోవడంతో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి.

శాంతిభద్రతలకు భంగం కలిస్తే చర్యలు



నిర్మానుష్యంగా పెద్దవడుగూరు

పెద్దవడుగూరు: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గ్రామాల్లో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ మండల కేంద్రంలోని ప్రధాన వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుగూ ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా , సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులా ఉపేక్షించేది లేదన్నారు. అయినా పోలీసుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ టీడీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

- రైతులు సూచనలు పాటించాలి
- వ్యవసాయాధికారి సోమశేఖర్



వేరుశనగ విత్తనాన్ని శుద్ధి చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: ఖరీఫ్‌లో పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు విత్తన శుద్ధి చేసుకుని సరైన మోతాదులో విత్తనం వినియోగిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని ఏఓ సోమశేఖర్ సూచించారు. ప్రధానంగా వేరుశనగ సాగుకు సంబంధించి విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్ల నివారించవచ్చన్నారు. వివరాలు.. విత్తన శుద్ధి చేయకుంటే పంట ఎదుగుదల, దిగుబడి తగ్గి తీవ్ర నష్టం వాటిల్లితుంది. రైతులు పంట దిగుబడి పెంచుకోవడానికి విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలి. విత్తనం ద్వారా సోకే రసం పీల్చే పురుగులను, శుద్ధి చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అదుపు చేసుకోవచ్చు. అన్ని రకాల పంటల విత్తనాలను శుద్ధి చేయాలి. రైతులు భూమిని దున్నటం ఎంత ముఖ్యమో శుద్ధి చేసిన విత్తనం వాడటం అంతే ప్రధానం. రైతులు ఏరువాక సమయంలో విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటారో కొనుగోలు చేసిన విత్తనం కూడా విత్తన శుద్ధి చేస్తే పంట దిగుబడి సాధించవచ్చు.

పంటల్లో విత్తన శుద్ధి ఇలా..

వేరుశనగ: వేరుశనగ విత్తనాలను ట్రికోడెర్మా విరిడితో విత్తనశుద్ధి ద్వారా వేరుకుళ్లు, ఇతర తెగుళ్లను సమర్థవంతంగా అడ్డుకోవచ్చు,

వరి : వరి విత్తనాలను అంటుకుని ఉన్న శిలీంద్రాల నివారణ కోసం 2 గ్రాముల కార్బోం డిజిమ్ మందును తీటరు నీటిలో కలిపి అందులో కిలో వరి విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి.ఆ తర్వాత మడిలో చల్లుకోవాలి.

కంది: కంది, పెసర పంటలో రసం పీల్చే పురుగులు తొలి దశలోనే నష్టం చేస్తాయి. వీటి నివారణ కోసం కిలో విత్తనాలకు 30.మి.లీ కార్బోసల్ఫాన్ మందును విత్తనానికి పట్టించిన తర్వాత 3 గ్రాముల కాప్టాన్‌ను కలిపి శుద్ధి చేయాలి. అలాగే రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టిస్తే అధిక దిగుబడి పొందవచ్చును. ట్రైకోడెర్మా విరిడీని కలిపి శుద్ధి చేసుకోవాలి.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి



రైతులు పంటలలో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్ల నివారణతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చును. అలాగే రసాయన మందులతో పాటు బీజామృతం, ట్రికోడెర్మావిరిడీ, రైజోబియం కల్చర్‌తో కూడా విత్తనశుద్ధి చేసుకోవచ్చును.

– ఏఓ సోమశేఖర్

సేంద్రియ ఎరువు శ్రేయస్కరం

రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు రకరకాల రసాయన ఎరువులు వాడుతుంటారు. కానీ పంటల దిగుబడి తగ్గడంతో పాటు భూసారం క్షీణించి పోతోంది. ఈ రసాయన ఎరువులతో రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో చేసిన పొరపాట్లే మళ్లీ మళ్లీ చేయకుండా ఈ ఖరీఫ్‌లో సేంద్రియ ఎరువైన పశువుల పేడ వాడాలని, ఇది పంటలకు ఎంతో ప్రయోజనమని మండల వ్యవసాయ అధికారి అన్నారు. రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. పశువుల ఎరువు, వర్మీంకపోస్టు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల ఎరువును సేంద్రియ ఎరువుగా చేసుకోవచ్చు. సేంద్రియ ఎరువుల్లో ఉన్న పోషకాల శాతాన్ని తెలుసుకుని తగిన మోతాదులో దశల వారిగా వేస్తు పంటలు పండిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. దిగుబడులు సైతం పెరుగుతాయి. భూసారం అభివృద్ధి చెందుతుంది. పశువుల పేడను దుక్కులు దున్నకునే ముందు నుంచే పంట పొలాల్లో వేసుకుంటే చాలా మంచిది. దుక్కులు దున్నాక పశువుల పేడ పంట ఎదుగుదల మొక్కలు బలంగా ఉండేందుకు ఉపయోగపడుతుంది. అలాగే పంటల దిగుబడి పెరిగి రైతు లాభపడతాడు.

హిందూ ధర్మప్రచారకుడి మృతి



సంజీవరెడ్డి (ఫైల్)

అనంతపురం కల్చరల్: హిందూ ధార్మిక కార్యక్రమాలకు జిల్లాలో పెద్ద దిక్కుగా ఉన్న చిన్నపరెడ్డి సంజీవరెడ్డి (75) మంగళవారం ఆకస్మికంగా మరణించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో కీలకంగా ఉన్న సంజీవరెడ్డి విశ్వ హిందూపరిషత్తుతో పాటూ బీజేపీ నగర అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేశారు. భారతీయ మజ్దూర్ సంఘ్‌లో ఉంటూనే హైందవ ధర్మప్రచారానికి తగినంత సమయం కేటాయిస్తూ అనేక మందిని సనాతన భారతీయ ధర్మం వైపు నడిపించారు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో స్థానిక అశోక నగర్‌లోని హరిహర దేవాలయంలో భాగవతం చదువుతూ మరణించారు. సంజీవరెడ్డి మృతి హైందవ సంస్థలకు తీరని లోటని పలు సంస్థల ప్రతినిధులు తమ సంతాపం తెలియజేశారు. సంజీవరెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు దశాబ్దాలుగా సంఘ్ పరివార్‌లోనే కొనసాగుతున్నారు. స్థానిక హరిశ్చంద్ర ఘాట్‌లో బుధవారం ఉదయం సంజీవరెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్ బోల్తా.. ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రామచంద్ర అనే వ్యక్తి గాయపడ్డాడు. జడ్ వీరారెడ్డి కాలనీకి చెందిన ఆయన బైక్‌లో గుంతకల్లు రోడ్డు బ్రిడ్జి వద్దకు బైక్‌లో వెళ్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

తాడిపత్రిలో టీడీపీ అభ్యర్థి విజయం

తాడిపత్రి: అనంతపురంలో జరిగిన కౌంటింగ్‌లో తాడిపత్రి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జేసీ అస్మిత్‌రెడ్డి 28,394 వేల ఓట్ల మెజారిటీతో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిపై గెలుపొందారు. కేతిరెడ్డి పెద్దారెడ్డికి 20 రౌండ్ల ఓట్ల లెక్కింపులో 85,245 వేల ఓట్లు రాగా, 779 పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 86,024 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డికి 1,12,313 లక్షల ఓట్లు రాగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,442 వేలతో కలిపి 1,13,755 లక్షల ఓట్లు వచ్చాయి. మొత్తం 14 టేబుళ్ల ద్వారా 20 రౌండ్ల ఓట్ల లెక్కింపులో భాగంగా మొదటి రౌండ్‌లో టీడీపీకి 4,939 ఓట్లు రాగా వైఎస్సార్సీపీకి 4,840 ఓట్లు , రెండవ రౌండ్‌లో వైఎస్సార్సీపీ 4,951, టీడీపీ 4,978, ఓట్లు మూడో రౌండ్‌లో వైఎస్సార్సీపీ 4,869, టీడీపీ 5,064 ఓట్లు సాధించాయి. నాలుగవ రౌండ్‌లో వైఎస్సార్సీపీకి 4,294 ఓట్లు, టీడీపీకి 5,226 ఓట్లు, ఐదో రౌండ్‌లో వైఎస్సార్సీపీకి 4,593 ఓట్లు, టీడీపీకి 5,752 ఓట్లు వచ్చాయి. ఇలా ప్రతి రౌండ్‌లో టీడీపీ అభ్యర్థి మెజార్టీని పెంచుకుంటూ ఆధిక్యాన్ని కనబరిచారు. ఆరో రౌండ్‌లో 1,969 ఓట్లు, ఏడో రౌండ్‌లో 387 ఓట్లు, ఎనిమిదో రౌండ్‌లో 924 ఓట్లు, తొమ్మిదో రౌండ్‌లో 1,070 ఓట్లు, పదో రౌండ్‌లో 1,961 ఓట్లు, 11వ రౌండ్‌లో 1,605 ఓట్లు, 12వ రౌండ్‌లో 1,526 ఓట్లు, 13వ రౌండ్‌లో 1,278 ఓట్లు, 14వ రౌండ్‌లో 1,538 ఓట్లు, 15వ రౌండ్‌లో 3,035 ఓట్లు, 16వ రౌండ్‌లో 2,019 ఓట్లు, 17వ రౌండ్‌లో 2,791 ఓట్లు, 18వ రౌండ్‌లో 1,184 ఓట్లు, 19వ రౌండ్‌లో 2,166 ఓట్లు, 20వ రౌండ్‌లో 1,203 ఓట్లు టీడీపీ అభ్యర్థి మెజార్టీ కనబరిచారు. వీటికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా వచ్చిన 663 ఓట్లు అధిక్యతతో మొత్తంగా టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డి 27,731 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తాడిపత్రిలో ఎన్నికల పోలింగ్, మరుసటి రోజు జరిగిన అల్లర్ల నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఇప్పటికీ ఇక్కడ 144 సెక్షన్ కొనసాగుతోంది. ఎలాంటి సంబరాలు చేసుకునేందుకు అనుమతులు లేవు. దీంతో టీడీపీ శ్రేణులు అనంతపురంలోనే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నాయి. తాడిపత్రిలోని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వద్ద పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. అలాగే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద కూడా గట్టి బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పహారా

పెద్దపప్పూరు: ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడంతో సమస్యాత్మక గ్రామాల్లో యాడికి సర్కిల్ సీఐ రోషన్ నేతృత్వంలో సిబ్బంది ఎలాంటి సంబరాలు, వేడుకలు, సమస్యలు చోటు చేసుకోకుండా మండల వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఉంచడంతో ఆయన పర్యటించారు. ఫలితాల సందర్భంగా పోలీసు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి సంబరాలు జరుపు కోకూడదని, సమస్యలు సృష్టిస్తే ఎంతటి వారైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో ప్రతొఇ ఒక్కరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. గెలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు హమానుల్లా, మహాదేవ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన



యాడికిలో పోలీసుల సమక్షంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ కార్యకర్తలు

యాడికి/పామిడి/గుత్తి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెలువడిన అనంతరం మంగళవారం సాయంత్రం మండల కేంద్రంతో పాటు రాయలచెరువు, చందన, లక్షుంపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ఈ నెల 6 వరకూ గెలిచిన పార్టీ వారు సంబరాలు, టపాసులు పేల్చరాదని జిల్లా అధికారులు చెబుతున్నా గుంపులు, గుంపులుగా రోడ్‌పైకి వచ్చి ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తొలగించి వీధుల్లో తిప్పారు. దీంతో పోలీసులు చేసేదేమి లేక సెల్‌ఫోన్‌లో కోడ్ ఉల్లంఘించిన వారి ఫోటోలను తీసుకున్నారు. సీఐ నాగార్జున రెడ్డి మండలంలోని అన్ని గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీసు బలగాలు, పోలీసులతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే పామిడి, గుత్తిలో నిబంధనలు ఉల్లంఘించి మంగళవారం టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరాం గెలుపొందడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీల జెండాలు చేతబూని బైక్‌ల్లో కలియ తిరిగారు.

ఘనంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి



తాడిపత్రిలో బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అభిమానులు



గుంతకల్లులో బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక స్నేహభారతి సంగీత శిక్షణాయలంలో నిర్వాహకుడు మహేష్‌స్వామి ఆధ్వర్యంలో ఎస్పీ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో బాలు యుగం స్వర్ణ యుగమని, ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమన్నారు. అనంతరం ఎస్పీ బాలు పాడిన కొన్ని సినీ గీతాలను అభిమానలు ఆలపించి ఆయన జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో అభిమానులు దర్భ మహేశ్వరశర్మ, గోపినాథ్, నాయుడు, బాలస్వామి, శివ, బాలు పాల్గొన్నారు.

గుంతకల్లు: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. బాలు పడిన పాటలు సూర్యచంద్రులున్నంత కాలం ప్రజల మనుస్సుల్లో ఉండిపోతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఈఓ రాముడు, జీఎంవీ చలపతి, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వర్షం.. రైతుల హర్షం



కూడేరు : కలగళ్ల వద్ద చెక్‌డ్యాంలోకి చేరిన వర్షపు నీరు



వజ్రకరూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలో గత పది రోజులుగా వర్షం జోరుగా కురుస్తోంది. 50.4 మిల్లీ మీటర్లు, 40.2మిల్లీ మీటర్లు, 38 మిల్లీమీటర్లు చొప్పున పదునైన వర్షాలు కురిశాయి. వర్షం నీరు చెరువులు, చెక్‌డ్యాంల్లోకి, కుంటలు, ఫారంపాండ్లల్లోకి చేరుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీటి నిల్వలతో భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీడు భూముల్లో పచ్చి గడ్డి పడడంతో మూగజీవాలకు తాగునీరు, గ్రాసం దొరుకుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఆరంభం నుంచే వర్షాలు కురుస్తుండడంతో పంటల సాగుపై అన్నదాతల్లో ఆసక్తి పెరుగుతోంది. ఎక్కువ విస్తీర్ణంలో వేరుగనగ, కంది, ఇతర పంటల సాగుకు విత్తనాలను సిద్ధం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది వర్షాభావంతో మండల వ్యాప్తంగా వేరుశనగ పంటను కేవలం ఐదు వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేసి నష్టపోయారు.

వజ్రకరూరులో భారీ వర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. సాయంత్రం 4గంటలకు ప్రారంభమైన వర్షం గంటకుపైగా కురిసింది. భారీవర్షం కురవడంతో కాలనీల్లో వర్షపునీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. కాలనీలగుండా వచ్చే వర్షపు నీరు మెయిన్‌రోడ్ మీదుగా చెట్టుకుంట వైపు ప్రవహించింది. వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరగనున్నాయి. భారీవర్షం కురవడంతో వజ్రకరూరు పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ రావడంతో రైతులు వేరుశనగ పంటతోపాటు ఆముదం, కంది తదితర పంటలను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి మంచి దిగుబడులు రావాలని రైతులు కోరుకుంటున్నారు.

గుంతకల్లు ,శింగనమల టీడీపీ కైవసం



డిక్లరేషన్ తీసుకుంటున్న గుమ్మనూరు జయరాం



డిక్లరేషన్ తీసుకుంటున్న శ్రావణశ్రీ

గుంతకల్లు: ఉత్కంఠ రేపిన గుంతకల్లు అసెంబ్లీ ఫలితాల్లో విజయం తెలుగుదేశం అభ్యర్థిని గుమ్మనూరు జయరాంను వరించింది. మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో సమీప పత్యర్థి వైఎస్సార్సీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి మీద 7,026 మెజార్టీతో ఆయన గెలుపొందారు. అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఎన్నికల అధికారుల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు గుంతకల్లు నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లలో 20 రౌండ్లలో నిర్వహించిన కౌంటింగ్‌లో ప్రారంభం నుంచి టీడీపీ అభ్యర్థి జయరాం అధిక్యత సాగింది. తొలి రెండు రౌండ్లలో టీడీపీ అధిక్యతను కనబరచగా మూడో రౌండ్ నుంచి 9వ రౌండ్ వరకూ వైఎస్సార్సీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి అధిపత్యాన్ని కనబరిచారు. అయితే 10 రౌండు నుంచి 20వ రౌండ్ వరకూ గుమ్మనూరు జయరాంకు ప్రతి రౌండ్‌లోని అధ్యకతను చాటి 7,026 ఓట్లతో (పోస్టల్ బ్యాలెట్ కలుపుకుని) విజయ సాధించారు. రిటర్నింగ్ అధికారి వీ.శ్రీనివాసులురెడ్డి గెలుపొందిన జయరాంకు డిక్లేరేషన్ ప్రతం అందజేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థికి 5,146 ఓట్లు వచ్చాయి. నోటాకు 1,746 ఓట్లు రావడం విశేషం. కాగా జయరాంతో నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

శింగనమల ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ

శింగనమల: శింగనమల ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ తన సమీప అభ్యర్థి వైఎస్సార్సీపీకి చెందిన ఎం.వీరాంజనేయులుపై 8,788 ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. టీడీపీ అభ్యర్థికి 1,02,957 ఓట్లు, వైఎస్సార్సీపీ అభ్యర్థికి 94,169 ఓట్లు వచ్చాయి. ఇక బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి గౌతమికి 3,896 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సాకే శైలజానాథ్‌కు 3,469 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థులు వి.సాయి ప్రసాద్‌కు 389 ఓట్లు, ఎం.మాధవకు 230 ఓట్లు, ఎం.నల్లప్పకు 157 ఓట్లు, కె.ఓబిలేసుకు 142 ఓట్లు, సాకే శ్రీదేవికి 110 ఓట్లు, కె.రాంమోహన్ 97 ఓట్లు, ఆనంద్‌కుమార్ 87 ఓట్లు వచ్చాయి. నోటాకు 1,906 ఓట్లు పోల్ అయ్యాయి.

సంక్షిప్త సమాచారం

గొడవలకు పాల్పడితే చర్యలు

యల్లనూరు: పార్టీల గెలుపు ఓటములు సహజమేనని, ఎవ్వరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని శాంతిభద్రతలకు భంగం కల్గించకూడదని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ గిరిబాబు సూచించారు. మండలంలోని తిమ్మంపల్లి, కొడవండ్లపల్లి, చింతకాయమంద, గొడ్డుమర్రి, వెన్నపూసపల్లి , గడ్డంవారిపల్లి తదితర గ్రామాల్లో సిబ్బందితో కలసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా, విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. పల్లెల్లో ఏవైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

నేడు ఉపాధి సిబ్బంది సమావేశం

యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఓ షబ్బీర్‌బాషా మంగళవారం తెలిపారు. సమావేశంలో కూలీల హాజరు పెంపు, ప్రగతి లక్ష్యాల చేరుకోవడం, వలసలను నివారించడం, పండ్లమొక్కల పెంచడంపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు హాజరు కావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

పావగడ: ఆరోగ్యం, ఆరోగ్యకర జీవనంతో పాటు భావితరాలను రక్షించడం కోసం పొగాకు రహిత సమాజాన్ని అందరూ కలసికట్టుగా నిర్మించాలని స్థానిక శ్రీక్షేత్ర ధర్మస్థలం గ్రామాభివృద్ధి సంఘం తాలూకా యోజనాధికారి మహేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం, సంఘ సంస్థలు దేశ వ్యాప్తంగా పొగాకు నిర్మూలనకు వివిధ అభియాన కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో సైతం పొగాకు నియంత్రణపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరులకూ తెలియజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బుడేన్ బాబు, ప్రిన్సిపాల్ వినయ్‌బాబు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యం చెడిపోతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. తర్వాత భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యం కట్టి పూలతో అలంకరించి మహా మంగళారతి ఇచ్చారు. అమ్మవారికి విశేష పూజ రోజు కావడంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. మహిళలు ఆలయ సమీపంలోని పాలబావి వద్దకు చేరుకుని గంగ పూజను చేశారు.